ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

ప్రకటన రేట్లు

కాజువల్: కాలం సెం. మీ. 1 కి రు. 7–50
కంట్రాక్టు: కాలం సెం. మీ. 1 కి రు. 6–80
250 సెం. మీ. లు, ఆపైన
( ప్రకటనకు కనీస స్థలం
ప్రతి. కాలం 5 సెం. మీ. లు

అట్ట పేజీలు :

4 వ పేజీ - రెండు రంగులు

కాజువల్: ప్రకటన 1 కి రు. 1,100/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 950/—
( కనీసం 6 ప్రకటనలు )

2 వ పేజీ, 3 వ పేజీ -
ఒక రంగు

కాజువల్: ప్రకటన 1 కి రు. 700/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 600/—
( కనీసం 6 ప్రకటనలు )

కొలతలు:

కాలం వెడల్పు 5 సెం. మీ.
కాలం నిడివి 23 సెం. మీ.
పేజీకి 3 కాలంలు

ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:
అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2
1–8–66 నుంచి ప్రకటనలన్నిటిమీదను
10% సర్చార్జి విధించబడును.


**స్త్రీకి శత్రువు స్త్రీయే. స్త్రీలకు మగవారివలన కలిగే అపకారం కంటె సాటి స్త్రీలవలన కలిగేదే ఎక్కువ. సుఖసంతోషాల విషయంలో స్త్రీ తన స్వార్థమే చూసుకుంటుంది. స్వార్థానికి ఎవరినైనా బలి యిస్తుంది. ఆ తెగువ మగువకే ముక్కెర, ఆమెను నమ్మినవారికి అది అడకత్తెర.**

శ్రీలంకకడలి నురగలు చిమ్ముతూ అవిరామంగా ఎగసి ఎగసి పడుతూంది. చుక్కల దుప్పటి కప్పుకుని ఆకాశం ముకుళించుకుని కూర్చుంది. మౌన ముద్రలో ఉన్న మహా యోగిలా ఏరాడకొండ గంభీరంగా నిల్చుని ఉంది. శిథిలమైన బీచ్‌రోడ్ మీద ఉండి ఉండి ఒకటీ, అరా కార్లు జర్రుమంటూ సాగుతున్నాయి.

వెంకటేశ్వరస్వామి కోవెల దగ్గరగా ఉన్న ఇసక ప్రాంతంలో పాడుపడిన కర్రతెప్ప పక్క చతికిలపడి ఉన్న కల్యాణి, ఈ మౌనం మరింక భరించలేనట్టు "బావా!" అంది.

ఒకదాని వెనక ఒకటిగా ఏర్పడుతున్న అలలకదలిక చూస్తూన్న వేణు వెనక్కి తిరిగి కల్యాణిని చూశాడు.

"సముద్రమంటే నీ కంత ఇష్టమా బావా?"

నెమ్మదిగా నవ్వేడు వేణు. నవ్వుతూన్నప్పుడు అతని బుగ్గలమీద ఏర్పడిన సంకోచవ్యాకోచాలు చీకటి వెలుగుల్లో మనోహరంగా కన్పించేయి కల్యాణికి.

"అవును కల్యాణీ, సముద్రమంటే నా కెంత ఇష్టమో వర్ణించి చెప్పలేను. చిన్నప్పటినించీ సముద్రమంటే నాకో పెద్ద గౌరవం. సముద్రాన్ని, నీలినీలి తరంగాల్నిచూస్తూ నిన్నూ, నన్నూ సర్వాన్నీ మరిచిపోగలను. దానికి కారణం బహుశః సముద్రుడిలోని గంభీరత అనుకుంటాను. సముద్రుడిని చూసినప్పుడల్లా అతనంత గంభీరంగా ఉండాలనిపిస్తుంది. అంతటి హృదయ వైశాల్యం పెంచుకోవాలనిపిస్తుంది. అన్నింటికీ అతీతుడినై మనిషిగా మిగిలిపోవాలనిపిస్తుంది."

తనలో తాను గొణుక్కుంటున్నట్లు ఆ మాటలు అన్నా, అవి స్పష్టంగా కల్యాణికి వినిపించేయి. మంద్ర స్థాయిలో వినిపిస్తూన్న అలలకలకలం మధ్య ఆ మాటలు ఆపాత మధురంగా తోచేయి కల్యాణికి.

"ఎంత చక్కగా చెప్పేవు బావా!"

"కొంపదీసి — నా మాటలు నీ కథల్లో ఉపయోగించేవు — " అని నవ్వేడు మళ్లీ.

"ఫో, బావా! నీదంతా వేళాకోళం. నా కథలంటే నీకంత నవ్వులాటలుగా ఉందన్నమాట."

"ఛ . . . ఛ. . . నేనా ఉద్దేశ్యంతో అనలేదు." అన్నాడు వేణు పిడికిట్లోకి పచ్చని ఇసక తీసుకుంటూ.

మళ్లీ ఇద్దరిమధ్యా నిశ్శబ్దం మంచులా పేరుకుపోసాగింది. వేణు సిగరెట్ వెలిగించుకున్నాడు. అగ్గిపుల్ల వెలుగులో కల్యాణి చెవి రింగులు మిలమిలలాడేయి. పొగ వదులుతూ వాచీ చూసేడు.

"ఏనిమిదైంది. ఇక పోదామా కల్యాణీ?" అన్నాడు చుట్టూ ముసిరిన చీకటి తెరల్నిచూస్తూ.

కల్యాణి దృష్టి అలలమీద ఉంది.

"తొందరేముంది? చుద్దాంగానీ, బావా, నిన్నో మాట అడగనా?"

"ఓ దానికేం? అడుగు—"

"మీ మొగాళ్లింత స్వార్థపరు లెందుకయ్యారు?"

"మా మొగాళ్లా?"

"అవును. మీ మగరాయుళ్లే. పార్వతి అని నా ఫ్రెండ్ ఒకామె ఉంది. . . నీకు తెలుసనుకుంటాను."

"ఎవరూ ఆ రింగుల పిల్లా . . . ?" అన్నాడు వేణు మధ్యలో.

"నీకు బాగా గుర్తే!"

"బావుంది. ఎందుకు గుర్తుండదూ? చెవులు చిన్నవి, రింగులు పెద్దవి. ఇంతకీ ఆ పిల్లకి ఏమైందిట పాపం?" అన్నాడు సిగరెట్ నుసి రాలుస్తూ.

"ఆ, మధ్య పెళ్లయింది. పెళ్లయిన ఏణ్ణర్థానికి భర్త చనిపోయేడు . . ."

"ప్చ్ . . . పాపం!"

"ఇక ఆమె బతుకు అలా కుళ్లిపోవలసిందేనా బావా?"

"వెయ్యి సంవత్సరాల కింద వెయ్యవలసిన ప్రశ్న వేశావు. . . మళ్లీ ఆమె వివాహం చేసుకోవచ్చుగా! బాగా, మహబాగా బతకడం మనిషి జన్మహక్కు."

"కాదనను. గాని ఏడాదిపాటు భర్తతో కాపరం చేసిన స్త్రీని వివాహం చేసుకోడానికి ఏ మగాడు ముందుకి వస్తాడంటావు?"

"అది ఆ అమ్మాయి అందచందాలమీద ఆధారపడి ఉంటుంది. ఆమె ఉన్న పరిస్థితుల మీద కూడా ఆధారపడి ఉంటుంది."

"ఇంకో విషయం కూడా చెబుతాను విను. పార్వతి వదిన ఈ మధ్య పురుటిలో చచ్చిపోయింది. ఆ ఇంట్లో పురిటి వాసనలు ఇంకా పోకముందే చక్కా మరో పెళ్లి చేసుకున్నార్చున్నాడు ఆ మగ మహారాజు."

ఆమె మాటల్లో కన్నా ముఖంలో ద్యోతకమవుతున్న అసహ్యభావాన్ని చూసి ప్రాన్పడ్డాడు వేణు.

"మగవాడి పరిస్థితి అలా ఉండడానికీ, ఆడదాని పరిస్థితి ఇలా అధ్వాన్నంగా ఉండడానికీ కారణం మీ మగజాతే— ! కాదంటావా బావా?" ఆవేశంగా అంది కల్యాణి.

సిగరెట్ పీలుస్తూ క్షణంసేపు ఆలోచించేడు వేణు. పొగ వదులుతూ మాటిగా కల్యాణి మొహంలోకి చూశాడు.

"కల్యాణీ! నువ్వా ప్రశ్న చాలా తేలిగ్గానే వేసేవు గాని సమాధానం అంత తేలికైనది గాదు. ఏ ప్రశ్న వెనక చాలా పెద్ద కథ ఉంది. ఈ సమస్య అంత ఆషామాషీగా పరిష్కరించబడేదిగాదు" అన్నాడు శాంతంగా.

"అంతేగాని, మీ మగాళ్లు స్వార్థపరులన్న మాట ఒప్పుకోవు . . . ఏం?" అంది కల్యాణి రెట్టిస్తూ.

"అందరూ అన్న మాట నేనొప్పుకోను. రాజారాం మోహన్‌రాయి, వీరేశలింగం పంతులుగారు స్వార్థపరులన్న మాట నువ్వూ ఒప్పుకోవనుకుంటాను. ఏం?" అన్నాడు వేణు.

**రామవరపు
వేణుగోపాలరావు**

# కడలి అంచున



కళ్యాణి సమాధానం ఇవ్వలేదు. మునిపంటితో కింది పెదవి నొక్కిపెట్టి సముద్రాన్ని తరిచి తరిచి చూస్తోంది.

"స్త్రీని ఉద్ధరించి సమాజంలో పురుషునితో సమానస్థాయిని కలిగించాలని చాలా మంది ప్రయత్నించారు. దానికి దోహదం చేసే మార్గాలని ఎన్నో రకాలుగా అన్వేషించారు. కాని దొరకలేదు. కారణం తెలుసా?"

ఎటో చూస్తున్న కళ్యాణి తలతిప్పి వేణు వైపు 'ఏమిటి?' అన్నట్టు చూసింది.

"ఆ మార్గం అంత తేలికైనది కాదు కనక, ఆ మార్గాన్ని ఆర్థికసూత్రాలనే ముళ్ళ డొంకలు అడ్డుకున్నాయి కనక— !"

"అంటే— ?"

"అంటావా — చెబుతా విను. ప్రతి తండ్రీ తన కొడుకులతో సమానంగా కూతుళ్ళని చదివించాలి. వాళ్ళకిచ్చినంత చనువు, స్వేచ్ఛ కూతుళ్ళకీ ఇవ్వగలగాలి. కొడుకులతోబాటే తన ఆస్తి కూతుళ్ళకీ కూడా సమానంగా పంచగలగాలి. ప్రతి పురుషుడూ స్త్రీని గౌరవంగా అభిమానంగా చూడాలి. సాధారణంగా సంస్కరణ అనేది ఇలాగే జరగాలి. అవునంటావా, కళ్యాణీ?" అన్నాడు వేణు సిగరెట్ పీక విసిరేస్తూ.

కళ్యాణి నిశ్చలంగా కూర్చుంది.

"అవును. నువ్వన్నట్టు జరిగితే ఈ ఆడ మగ తేడాలే ఉండవు. సమస్యలూ లేవు, కష్టాలుండవూ లేవు. అదే నిజంగా ఆదర్శప్రాయమైన మానవ సమాజం!" అంది కళ్యాణి మెల్లిగా.

"ఆ మాట ఒప్పుకున్నావు కదా. అయితే మరి ఆ

# మన సైనిక చరిత్ర

భారతచరిత్రవలె భారతసైనికుల రణకౌశలము శౌర్యధైర్య పరాక్రమాల గాథకూడా అతి ప్రాచీనమైనది.

ఈనాటి మన సుసంఘటిత విజయ వాహిని 1747 నుండి వికసిస్తూ, వచ్చింది. ఆ నాడు భారత సైన్యమంతా చిన్న చిన్న ముక్కలుగా ఉండేది. ఇలాంటి సైన్యాన్ని ఈస్టిండియా కంపెనీ సంయుక్తవాహినిగా రూపొందించింది. దానికి ప్రప్రథమ కమాండరన్ చీఫ్ మేజర్ స్ట్రింగర్‌లారెన్సు.

1914 ప్రథమ ప్రపంచ మహా సంగ్రామ సమయం.లో రమారమి ఒక ... యాభై వేల సైనికులతో మన సైన్యముండేది. 191/ నాటి ... లక్షల డెభ్భైమూడువేల వరకు పెరిగింది. ఆ నాడు మన భారతీయ సైన్యం అసమాన సాహసాన్ని చూపించి దేశదేశాల్లో ఖ్యాతి నార్జించింది. ద్వితీయ మహాసంగ్రామంనాటికి మన సైన్యం ఇరవైరెండున్నర లక్షలవరకూ వృద్ధి పొందింది. ఆ నాటి మన జవానులు ఇటలీ, ఇరాక్, సిరియా, గ్రీసు, ఉత్తరాఫ్రికా, మలయా, జావా మొదలగు సంగ్రామక్షేత్రాలలో బ్రహ్మాండంగా పోరు సలిపేరు.

1947 స్వాతంత్ర్యసిద్ధి అనంతరం దేశం విభజన అయింది. నాటి మన సైనిక సంఖ్య రెండు లక్షలడెబ్బై అయిదు వేలు. ఇందులో మనసేన 2ల. 50 వేల సైనికులు 45 రెజిమెంట్లుగాను, 25 వేలు గుర్ఖా సైనికులు 6 రెజిమెంట్లుగాను ఉండేది. 1950 లో దేశం సర్వతంత్ర స్వతంత్రమైనది. అప్పుడే పదాతినౌకా వాయుసేనలుగా మూడు భాగాలుగా నూతనరాజ్యాంగ ప్రకారం విభజన జరిగింది. త్రివిధాలైన ఈ సైన్యాలకు అధిపతులు ఆ నాడే ఏర్పాటు చేయబడ్డారు. వీటిపై సంపూర్ణాధికారి దేశాధ్యక్షుడు.

సైన్యంలో అనేక భాగాలుంటాయి. అతి చిన్న భాగాన్ని సెక్షన్ అంటారు. సెక్షన్‌లో పది మంది వరకూ జవాన్లుంటారు. ఒక నాన్‌కమిషన్డ్ ఆఫీసరు వీళ్లకు నాయకుడుగా ఉంటాడు. మూడు సెక్షన్లు కలిస్తే ఒక ప్లెటూన్ అవుతుంది. దానికి జూనియర్‌కమిషన్డ్ ఆఫీసరు అధికారి. మూడు ప్లెటూన్లు ... కంపెనీకి కమాండర్‌గా కమిషన్డ్ ఆఫీసరుంటాడు. ఈ సైనికభాగం యుద్ధరంగంలో స్వతంత్రించి ముందుకుపోతుంది. కంపెనీ తరవాత అతి ముఖ్యపాత్ర వహించే సైనికభాగం బెటాలియన్. పదాతిసేనలో అన్నివిధాలా ఆత్మస్థైర్యంగల ముఖ్య భాగమే ఈ బెటాలియన్. లెఫ్టినెంటు కర్నల్ దీనికి నేతృత్వం వహిస్తాడు. ఇతని ఆధ్వర్యంలో ఒక మేజరు, ఆరు కంపెనీలకమాండర్లు ఉంటారు.

బ్రిగేడ్‌లో మూడు బెటాలియన్లు ఉంటాయి. సరఫరా, వైద్యచికిత్స, ఫిరంగిశాల మొదలైన విభాగాలుకూడా బ్రిగేడ్‌లో ఉంటాయి. దీనికి బ్రిగేడియర్ అధికారి. ఇతని సహాయార్థం బ్రిగేడ్ మేజరు, కమిషన్డ్ఆఫీసర్లు ఉంటారు. సాధారణంగా మూడు బ్రిగేడ్లు ఒక డివిజన్‌లోఉంటాయి. సమయానుసారంగా అనేక చిన్న చిన్న సైనికభాగాలుకూడా ఇందులో చేరుతూ ఉంటాయి. ఇందులో పదివేలనుంచి పది హేను వేల వరకూ సైనికులుంటారు. మేజర్‌జనరల్ దీనికి అధికారిగా ఉంటాడు. రెండు మూడు డివిజన్లు కలిస్తే కోర్ అవుతుంది. దీనికి కమాండర్‌గా లెఫ్టినెంట్‌జనరల్ నియుక్తుడౌతాడు. ఒకటి రెండు కోర్‌లు కలిస్తే ఆర్మీగాను, రెండు ఆర్మీలు కలిసి ఆర్మీగ్రూప్‌గాను పిలవబడతాయి.

ఇన్‌ఫేంట్రీ, పదాతిబలం ఆర్టిలరీ (ఫిరంగులతో ఉన్నది) అని భూసేన రెండు భాగాలు. సైన్యంలో ఇన్‌ఫెంట్రీకి ప్రాధాన్యం హెచ్చు. శత్రువుతో చేతులు కలిపి, వాళ్లను ... చొచ్చుకొని పోవటంలో కాల్బలం ప్రధాన పాత్ర వహిస్తుంది. రైఫిల్ వీళ్లకు ముఖ్యాయుధం. శౌర్యధైర్యపరాక్రమాలతో, శక్తిసామర్థ్యాలతో పౌరుషాన్ని ప్రదర్శించడానికి మిగిలిన సైనిక భాగాలకు లేని అవకాశం ఈ పదాతిబలానికి లభ్యమవుతుంది. పాకిస్తాన్ మనపై దురాక్రమణ జరిపిన సందర్భంలో పసితనంలో త్రాగిన ఆ పాక్‌సైనికుల కాకరాకుపసరును ఊడదీయ గలిగిన శ్రేయస్సు గౌరవప్రదమైన ఈ కాల్బలానికే దక్కింది.

ఇన్‌ఫేంట్రీకి ఆర్టిలరీకి విడివడని సంబంధంఉంది. ఆర్టిలరీ శత్రుసమూహం మీద గుండ్లవర్షం కురిపిస్తూంటేనే శత్రువ్యూహాన్ని చీల్చి చెండాడుతుంది ఇన్‌ఫెంట్రీ. ఆర్టిలరీ సహాయంతో ఇన్‌ఫెంట్రీ సురక్షితంగా ముందుకి పోగలుగుతుంది.

భూసేనలో సిగ్నలర్స్, ఇంజనీర్స్‌తో ఉన్న బెటాలియన్లుకూడా ఉంటాయి. ఇవికాక మెడికల్, ఆర్మీసర్వీస్‌కోర్ అనే విభాగాలుకూడా ఉంటాయి.

ఫీల్డ్‌ఆర్టిలరీ, ఏంటీఏయిర్ క్రాఫ్ట్, కోస్టల్‌బ్రాంచ్ అనే మూడు భాగాలగా ఆర్టిలరీ రెజిమెంటు విభజించబడి ఉంది. ఆర్మర్డ్‌కోర్ (కవచధారులు) అగ్ని వర్షం కురిపిస్తూ రణరంగంలో ముందుకుపోతుంది. బాంబులు కురిపిస్తుంది. పొరలు పొరలుగా గాలిలో పొగని ప్రవేశపెడుతుంది. 'ఫార్వర్డ్ అబ్జర్వేషన్‌పోస్టు' నాయకుడు తన వెనకనున్న సైనిక విభాగాలకు వైర్‌లెస్ సూచనలు ఇస్తూఉంటాడు. గుండె నిబ్బరంగల పైలట్లు శత్రుసేన మీదకు ఎగిరి తన ఆర్టిలరీకి రిపోర్టులు పంపుతారు. ఈ పని మిక్కిలి ప్రమాద భరితమైంది. ప్రతీ ఆర్టిలర్‌రెజిమెంటుకీ ఒక లెఫ్టినెంట్‌కర్నల్ కమాండర్‌గా ఉంటాడు.

మన సైన్యంలో గల ఆర్మర్డ్ డివిజను సెంటరియన్, షెర్మన్‌టాంకులతోను, ఫ్రాన్సు బ్రిటన్‌లలో తయారైన టాంకులతోను సుసజ్జితమై ఉంది. మన టాంకు వేగం గంటకు 24, 15 మైళ్లు. బరువు 50,60 టన్నులు. పాకిస్తానీయులుపయోగించిన అమెరికన్ టాంకు వేగం 30 మైళ్లు. బరువు 80 టన్నులు. మన టాంకు 8—10 మైళ్ల పరిధిలోపలే కొట్టగలుగుతుంది. అమెరికన్‌టాంకు పరిధి 12 మైళ్లు. అయినప్పటికీ భారత వీరజవానులు పాటన్ టాంకులను బూడిద చేశారు. ఈ విధంగా మన భారతసైనిక శక్తి అన్ని విధాలా త్వరితగతిలో వృద్ధి పొందుతూనే ఉంది.

—కాలిపు వీరభద్రుడు

---

జరగకుండా ఉండడానికి కారణం ఏమై ఉంటుందో మవ్వూహించేవా కల్యాణి. అలాంటి నవ మానవ సమాజం ఏర్పడకుండా నిరోధించగల శక్తులున్నాయని ఒప్పుకుంటావా?"

"ఒప్పుకుంటాను. ఏమిటా శక్తులు?" అవి ఏ విధంగా మనల్ని నిరోధిస్తున్నాయి?"

"చెబుతానుండు మరి" అంటూ వేణు మరో సిగరెట్ వెలిగించేడు. వెలిగి ఆరిన అగ్గిపుల్లని సముద్రం వేపు విసిరేడు.

"ఒకానొకప్పుడు స్త్రీల పరిస్థితి చాలా అధ్వాన్న స్థితిలో ఉండేది. వాళ్లని బానిసలకన్నా హీనంగా చూసేరు. ఇంటికి ఎవరైనా అతిథివస్తే వాళ్ళకి కడుపునిండా భోజనం పెట్టడమేగాకుండా — తమ భార్యలని కూడా వాళ్ళ పక్కని మంచంమీద పడుకోబెట్టేవారు . . ."

కల్యాణి అవాక్కయి వేణునే నిశ్చలంగా చూస్తూంది. ఆమె మనస్సులో వ్యథాసముద్రం పిచ్చి పట్టిన పులిలా హోరున గర్జిస్తూంది. ఇదేదీ పట్టని సాగరం పట్టరాని తమకంతో డాల్ఫిన్స్‌నోస్‌ని ముద్దుపెట్టుకుంటూంది.

". . . అం గాదు, గోబి ఎడారిలో మంగోలు పడుచుల్ని అర్ధనగ్నంగా నిలబెటే వారు. వారి ఎముకల మీద బలిసిన కొవ్వుని నొక్కి చూపిస్తూ, వర్ణిస్తూ వారిని వేలం వేసేవారు. కొన్ని వేల యేళ్ళు గడిచినా ఆ పాత సాంప్రదాయాని కింకా మనవాళ్లు భరతవాక్యం పాడలేదు. సినిమా తెరలమీద, నైట్ క్లబ్బుల్లోను, ఆఖరికి పత్రికలఅడ్వర్టయిజ్‌మెంట్లలోనుకూడా ఆడదాని అంగాంగాలూ ప్రదర్శితా లవుతూనే ఉన్నాయి. ఆంధ్రుల అందాల తార ఫలానా బీడీయే కాల్చమంటుంది. ఫలానా బ్లేడుతో గడ్డం గీసుకుంటేనే నిన్ను ముద్దాడుతా అంటుంది మరో నగ్నాంగి ... వ్యాపారాభివృద్ధికి ఆడదాని ఒళ్లు ఎక్స్‌ప్లాయిట్ అవుతూన్నంత వరకు, చేపల మార్కెట్లో చేపలా — మానవ సమాజ మార్కెట్లో ఒళ్ళు అమ్ముకునే నీచస్థితి నుంచి ఆడది బైటపడేవరకు, అందుకు ఉపయోగిస్తున్న శక్తులు విశ్లేషం అయినంతవరకు స్త్రీ స్వాతంత్ర్యానికిగాని, సమస్యలకిగాని, అభ్యుదయానికిగాని ఓ దారీతెన్నూ ఏర్పడదు" అంటూ ఆయాసంగా ఆగేడు వేణు. చల్లటి సముద్రపు గాలిలో కూడా, ఆవేశం మూలంగా అతని ముఖం మీద చిరు చెమట పట్టింది.

" — అంతవరకూ ఎందుకు? ఒక్క ముక్కలో చెప్పాలంటే — మగాడు డబ్బుకి బానిసైనంతవరకు

అది మగాడికి బానిసగానే ఉంటుంది. తరాలు మారనీ, ఏళ్ళు గడవనీ, దేశంలో ఆర్థిక సంక్షోభాలు ఏర్పడనీ, ఏమైనా కానీ పరిస్థితి అలాగే ఉంటుంది. ఇప్పుడు చెప్పు — మా స్త్రీలకి ఎవరివల్ల అపకారం జరుగుతూందో? ఇప్పుడైనా ఒప్పుకుంటావా, మా పార్వతికి వెంటనే వివాహం కాకపోవడంలో అర్థం లేక పోలేదని — ఏం?"

"అవును" మగతగా వంతపలుకుతున్నట్టు అంది కల్యాణి.

"పార్వతి వదిన చనిపోయింది. వాళ్ళన్న చప్పున మరో వివాహం చేసుకున్నాడు. ఎలా జరిగిందిది? కేవలం మగాడి స్వార్థమేనా? తనకి పెళ్ళి కాదేమో, వేలకొద్దీ కట్నం నాన్న ఇచ్చుకోలేడేమో అన్న భయం, స్వార్థం పార్వతి రెండో వదినలో లేకుండానే వాళ్ళన్నయ్యని వివాహం చేసుకుందా?"

కల్యాణి మాట్లాడలేదు.

ఆమె మస్తిష్కాన్ని ఎన్నో ఆలోచనలు అల్లిబిల్లిగా సాలెగూడు కట్టుకున్నాయి. ఎన్నాళ్ళగానో వేధిస్తున్న సమస్య తీరిన ప్రశాంతత ఆమె ముఖంలో ప్రతిబింబిస్తూంది.

ఓసారి చుట్టూ చూసేడు వేణు. మెల్లిగా లేచేడు వేణు. పక్కనే ఉన్న తెప్పమీద ఓ చెయ్యి ఆనించి "ఇక పోదామా, కల్యాణి?" అన్నాడు. అల్లంతదూరంలో పడి ఉన్న హేండ్ బేగ్ చేతిలోకి తీసుకుని కల్యాణి కూడా లేచింది.

"బావా, నువ్వు డాక్టరువి గదా, నీ కిన్ని విషయాలెలా తెలిశాయి?" అంది.

"పిచ్చిపిల్లా, డాక్టర్నయినంతమాత్రాన అవి నాకు తెలియకూడదని రూలుందా? ముందు నేను మనిషిని, తర్వాతే డాక్టర్ని. ఏమంటావు?" అంటూ ఆమెని సమీపించేడు.

గుండ్రని ఆమె భుజాలమీద రెండు చేతులు వేసి నక్షత్రాల వెలుగులో ఎర్రని పెదాల్ని ఆశగా వెదక బోయేడు. చప్పున లేడిలా అతనినించి విడిపించుకుంది కల్యాణి.

"అబ్బాయ్ గారికి అంత తొందర పనికిరాదు. ముందు మూడు ముళ్ళూ పడాలి . . . !" అంటూ చిలిపిగా నవ్వింది.

నవ్వుతూ అతన్ని చూసింది.

వేణు ఎటో తీక్షణంగా చూస్తున్నాడు.

ఒకటి . . . రెండు . . . మూడు . . . అలా ఎన్నో క్షణాలు . . . నిమిషాలు గడిచేయి. వేణు ఇంకా అటే చూస్తున్నాడు. కల్యాణి కుతూహలంగా అటు చూసింది.

దూరాన ఎవరో వ్యక్తి . . . ఎవరో తరుముకు వస్తున్నట్టు సముద్రంవేపు ఆ ఆకారం కదులుతూంది. కడలి అంచు దాటింది. . . మరుక్షణంలో అటువేపు దూసుకుపోయేడు వేణు. నిర్నిమేష అయి ఆశ్చర్యంగా అటే చూడసాగింది కల్యాణి.

అయిదు నిమిషాలపాటలాగే అటే చూసింది. కాసేపు పోయేక వేణు కనిపించేడు బట్టలన్నీ తడితో ముద్ద ముద్దయి ఉన్నాయి. అతని చేతుల్లో ఓ స్త్రీ!

ఇసుకలో ఆమెను పడుకోబెట్టి నుదుటిమీద పడుతొన్న జుట్టు ఎగదోసుకున్నాడు వేణు. మోకాళ్ళమీద కూర్చుని స్పృహతప్పి పడివున్న స్త్రీ నాడి చూశాడు.

కల్యాణి ఆశ్చర్యంగా చూడసాగింది. నాడి పరీక్షించాక తేలిగ్గా ఊపిరి పీల్చేడు వేణు.

"ఫర్వాలేదు. కాస్సేపట్లో స్పృహ వస్తుంది. ఆట్టే నీళ్ళు కూడా తాగలేదు. షాక్ వల్ల తెలివి తప్పింది. అంతే!"

కల్యాణి ముందుకు వంగి ఆ స్త్రీ ముఖంవేపు చూసింది. . . చిన్న చెవులు . . . పెద్ద రింగులు . . . చారెడేసి కళ్ళు . . . కళ్ళ వెనక నీలినీలి నీడలు . . .

"బావా, మన పార్వతి . . . !"

"ఎవరూ, పార్వతా? !" అంటూ ఆ స్త్రీని చూశాడు వేణు. 'మైగాడ్, పార్వతి ఆత్మహత్యకి ప్రయత్నించింది . . . కారణం. . . ?"

"నే చెప్పాగా బావా . . ." అంది కల్యాణి రుద్ధ కంఠంతో.

పార్వతిని అలా స్పృహతప్పి ఉన్న స్థితిలోనే తీసుకువెళ్ళి కార్లో పడుకోబెట్టేడు వేణు. కారు ఇల్లు చేరే వరకూ కల్యాణి మనసులోని ఆందోళన తగ్గలేదు.

* * *

"నన్నెందుకు రక్షించేరు వేణూ? నేను మీకెవర్ని? ఈ నరకంలో చచ్చేదాకా ఎంతకని బతకమన్నారు?" అంది పార్వతి.

> **మహిళ**
>
> శీలవతి, సౌందర్యవతి అయిన స్త్రీ పరమేశ్వరుని పరిపూర్ణ శిల్ప మూర్తి. అమరుల అపూర్వ వైభవము! పృథివిపై ఆశ్చర్యాలన్నింటిలోను పరమాశ్చర్యము!
>
> —హెర్మెస్

"ఛ . . . ఏమిటా మాటలు పారూ, మతి తెలివి తక్కువ దానిలాగా" అని మందలించింది కల్యాణి.

వేణు మౌనంగా సిగరెట్ పీలుస్తూ నిలబడ్డాడు.

"అయినా మీరు ఆత్మహత్య చేసుకోవలసిన అగత్యం ఏముందండీ పార్వతిగారూ? ఏం మించిపోయిందని? చదువు లేదా? అందంలేదా? కావాలంటే — ప్రయత్నిస్తే ఉద్యోగం దొరకదా? సుఖంగా మరో వంద కాలాలపాటు బతకలేరని భయమా?"

"మాటలతో నన్ను మభ్యపెట్టకండి వేణూ. నిజమే నా కన్నీ ఉన్నాయి. కాని ఏం లాభం? బతికి నన్నాళ్ళూ ఒంటరి బతుకే నాకు. నిరాశ, నిస్పృహల బతుకు ఎన్నాళ్ళంటే ఏం లాభం? నన్ను రక్షించి — మీరు నాకపకారమే చేసేరు . . ." అంటూ పార్వతి తల కిందికి దించుకుంది. దించుకున్న ప్రయత్నంలో ఆమె దాచుకున్న కన్నీళ్ళు వేణూ కళ్ల బడ్డాయి.

"ఏమో ఉపకారమే జరిగిందేమో!"

కల్యాణి తలఎత్తి వేణువి చూసింది. అతని మాటలు ఆమెకి అర్థంకాలేదు.

"బావా! నేను రేపు విజయనగరం వెళుతున్నాను. రెండు రోజుల్లో వచ్చేస్తాను. అంతవరకూ పార్వతి భారం నీదే! ఏం?"

"నీ ప్రయాణం వాయిదా వేస్తే బావుంటుందని నా సలహా!"

"కాని — తప్పదు బావా. పెళ్ళికింకా ఆట్టే వ్యవధికూడా లేదు. మా బాబాయికి పిన్నికి చెప్పకపోతే బాగుండదు. ఏమైనా అనుకుంటారు" అంది కల్యాణి సిగ్గుతో.

"పెళ్ళా — ఎవరిది?" అంది పార్వతి కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"ఇంకెవరిది? — అమ్మాయిగారిది!"

"అది, సరే — పెళ్ళికొడుకెవరు?"

కల్యాణి లజ్జాభారంతో తల ఇంకా కిందికి దించింది.

"ఆ సిగ్గే చెబుతూంది — పెళ్ళికొడుకెవరో, ఇంకా వేరే చెప్పాలా యేమిటి?" అన్నాడు వేణు.

"పార్వతీ — నేనొచ్చేదాకా నువ్వెక్కడికీ కదల కూడదు. నేనటునించి వచ్చేక నీ సంగతి తేలుస్తాను. పిచ్చి పిచ్చి ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోక! ఏం?"

పార్వతి మౌనం వహించింది. . . ఏదో అనబోయి తల ఎత్తింది. పొగమంచులో ఎర్రగులాబీల్లా పార్వతి కళ్ళు మిలమిలలాడేయి. "నువ్వు వేగంగా వచ్చెయ్ కల్యాణీ!" అంది.

"ఓకే!"

* * *

అనుకున్నట్టుగా కాక కల్యాణి ప్రయాణం ముగించే సరికి మరో నాలుగు రోజులు పట్టింది. . . తిన్నగా ఇంటి గుమ్మంలో నిలబడ్డ అప్పన్నని చూసి "అప్పన్నా, బావ ఇంట్లోనే ఉన్నారా?" అంది.

"లేదమ్మా నిన్న సాయంత్రం హైదరాబాద్ వెళ్లేరు"

"అమ్మగారో?"

"అమ్మాయిగారు కూడా అతనితోపాటే ఎళ్లేరండి. ఈ ఉత్తరం మీ కిమ్మన్నారండి" అంటూ ఓ కవరు ఇచ్చేడు.

అది అందుకుంటూంటే కల్యాణి ఒళ్ళు ఎందుకో జలదరించింది. గబగబా డ్రాయింగ్‌రూంలోకి వెళ్ళి సోఫాలో కూలబడింది. కవర్లోని ఉత్తరం తీసి చదవడం ప్రారంభించింది.

"కల్యాణి,

నేను చేసిన పని నువ్వు హర్షిస్తావనే ధైర్యం నాకుంది. నన్ను అపార్థం చేసుకోవనీ, మనస్ఫూర్తిగా మన్నిస్తావనీ నేను గాఢంగా నమ్ముతున్నాను. . . . మన పెళ్లి ఇంకా వారం రోజులే ఉంది, ఆ శుభ ఘడియల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న నిన్ను నిరాశ పరుస్తున్నందుకు విచారంగా ఉంది. సర్వమూ పోగొట్టుకున్న ఓ అభాగ్యురాలి నుదుట కుంకుమ తిలకం దిద్దుతున్నందుకు ఆమెకై కొత్త తోవ తలుపులు తెరుస్తున్నందుకు ఆనందంగా ఉంది. నన్నర్థం చేసుకో క్షమించు . . . !

—వేణు"

ఉత్తరం చదివిన కల్యాణి స్థాణువైంది. . .

మరి కొన్ని క్షణాల్లో ఆమె ముందు [illegible] ప్రత్యక్షమైంది. [illegible] ఆమె చెవుల్లో ఏవో [illegible] చెప్పాయి. . . ఏదో నిర్ధారణ చేసుకున్నట్టు కల్యాణి ముందుకు సాగింది.

మరుక్షణంలో కల్యాణి [illegible]! ★